# సత్సంగము వేళల్లో మార్పులు

## (31 మే, 2009 నాడు న్యూఢిల్లీలో మాస్టరుగారు ఇచ్చిన ప్రసంగము)

ప్రియమైన సోదరీ, సోదరులారా,

గత చాలా సంవత్సరాలనుండి సత్సంగానికి ముందు, సత్సంగములోనూ మరియు సత్సంగము తర్వాత ఏమి జరుగుతున్నదో నేను గమనించిన దానిని మీతో పంచుకోబోతున్నాను. మరియు దానికి ముందు మాటగా (Preamble), నేను మిషనులో చేరినపుడు అంటే సుమారు నలభై ఐదు సంవత్సరాల క్రితం నేను హాజరైన మొదటి బసంత్ ఉత్సవం షాజహానుపూర్‌లో జరిగిన నాటి రోజులలో ఏమి జరిగిందో నేను మీకు తప్పకుండా చెప్పాలి. బాబూజీతో సహా నలభై లేదా నలభై రెండుమంది బాబూజీగారి ఇంటి వద్దనే వుండేవారు. నాలుగు వందల చదరపు అడుగులు లేదా కొంచెం తక్కువగా ఒక గుడారము వుండేది. అయితే ఇక్కడ నేను మీకు తెలియచెప్పాలనుకున్నదేమిటంటే, మేము మా ఇంటినుండి బయలుదేరిన నాటి నుండి ఎక్కడ వున్నా గానీ మా హృదయాలు అంతులేని తపన (Enormous longing) తో నిండిపోయేవి. ఉదాహరణకు నేను వారము, పది రోజులు ముందుగానే మద్రాసు నుండి బయలుదేరేవాడిని. ఢిల్లీ వరకు నేరుగా ప్రయాణించి అక్కడ రైలు మారి షాజహానుపూర్ వెళ్ళేవాడిని. త్రోవ పొడుగునా అభ్యాసీలు వేర్వేరు స్టేషనులలో మాతో చేరుతూ వుండేవారు.

మరియు నేను మిషనులో చేరిన పది సంవత్సరాల తర్వాత అంటే 1974 వరకు కూడ సంఖ్య అంత ఎక్కువగా లేదు. షాజహాన్‌పూర్ ఆశ్రమంలో జరుపుకున్న తొలి బసంత్ నాటికి రెండు వేల నాలుగు వందలు లేదా రెండువేల ఐదు వందల మంది మరియు హాలు కేవలం ఎనిమిది వందల మందికి మాత్రమే సరిపడేది కావున క్రిక్కిరిసి ఉండేది. ఈ విధంగా అభ్యాసీల సంఖ్య పదకొండు, పన్నెండు సంవత్సరాల కాలంలో నలభై నుండి రెండువేల ఎనిమిది వందలకు పెరిగింది. కానీ, నేను మీకు చెప్ప ప్రయత్నించేదేమిటంటే, మేము మా స్వస్థలము నుండి బయలుదేరి మేము వెళ్ళే చోటుకై మా ప్రయాణం మొదలవుతూనే మా హృదయాలలో అంతులేని తపన కలిగేది. దక్షిణాది నుండి, ఉత్తరాది నుండి, తూర్పు పడమర దిశల నుండి ప్రయాణించి వచ్చిన వారందరూ మేము దేని కొరకు వెళ్తున్నామో, దేని కొరకు ముందుకు సాగుతున్నామో, ఈ ప్రయాణము యొక్క ఉద్దేశ్యము ఏది అనే వాటి గురించిన ఎడతెగని నిరంతర స్మరణలాగా వుండేది. వారికి కలిగే అసౌకర్యానికి గానీ, ఆహారపానీయాల గురించి గానీ ఎవరూ ఆలోచించేవారు కారు. ఇక మేము షాజహానుపూర్ చేరి రైలు నుండి దిగగానే, మా హృదయాలు బ్రద్దలవడానికి సిద్ధంగా ఉండేవి.

ఈ రోజులలో ఇదంతా నాకు కనిపించుట లేదని చెప్పడానికి విచారిస్తున్నాను. వేళలు మార్చడానికి, దినచర్యలు మార్చడానికి, ఆవశ్యకమైన నియమాలను సడలించడానికి నేను అనుమతినివ్వడము బహుశః అది నా పొరపాటే. పాటించవలసిన నియమాలను కఠినతరం చేస్తే ప్రజలు రారేమోనన్న నా నమ్మకమే నాతో ఇలా చేయించింది. "నాకు కావలసింది వాసి గాని రాశి కాదు" (I want quality, not quantity) అన్న బాబూజీ సూత్రాలను పాటించకపోవడమనే పొరపాటు చేశాము. గత నలభై ఐదు సంవత్సరాలలో ఎక్కడో ఒక చోట మొదట ఈ పొరపాటు నేనే చేశాను. వాసికి (నాణ్యతకు) కాక రాశికి (సంఖ్యకు) ప్రాధాన్యత నివ్వడం అనే ఆలోచన వలన మనకు రాశి తప్ప వాసి కొరవడింది. ఇది ఏ వ్యక్తిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్య కాదు. ఇది ఒక వ్యాఖ్య మాత్రమే. ఇంగ్లీషు నానుడిలో అన్నట్లుగా "ఈ టోపి ఎవరికి సరిపోతే వారినే ధరించనీ". ఇది విచారకరం. ఎందుకంటే ఆదివారం సత్సంగము ఉదయం 9 గంటలకు మార్చడంతో అభ్యాసీలు దీనిని చాలా తేలికగా తీసుకొని వారేదో పనికి వెళ్ళినట్లుగా లేదా తప్పదన్నట్లుగా వెళుతున్నారే కాని వారి కొరకు మాత్రము కాదు. సంస్థ కొరకో లేదా ప్రిసెప్టరు కొరకో, మరింక దేని కొరకో వెళుతున్నట్లుగా వుంది.

అందుకే మనం తాపీగా నిద్రలేస్తాము. బ్రేక్‌ఫాస్ట్ యేమో చేస్తాము. నిండిన కడుపులతో వస్తాము. బ్రేక్‌ఫాస్ట్ పెట్టడం మనం చేసిన పెద్ద పొరపాటు. అందుకే మనం ధ్యానంలో కూర్చుంటే, మనలో చాలామంది కడుపులు నిండుగానో, హృదయాలు ఖాళీగానో, మెదడు నిండా కలతలతోనో వుండి గురకలు పెడతాము – మనలో చాలామంది. ఇది చాలా విచారకరం. ఎందుకంటే మనం ఆవిరిలేని బొగ్గు ఇంజనులాంటి వాళ్ళము. ఇంజనే కదలలేనప్పుడు ఇక మొత్తము రైలునేమి లాగ గలుగుతుంది.

అందుకే నేటినుండే నేను సాధికారికంగా కొన్ని మార్పులు చేయబోతున్నాను. మనం ఎక్కడ వున్నా సరే, ఆదివారం సత్సంగము ఉదయం గం.7-30 ని॥లకు వుంటుంది. అది హిమాలయాలలోనైనా సరే, అమెరికాలోనైనా సరే, లేక ఎడారిలోనైనా సరే, తప్పనిసరిగా ఉ.7-30 ని॥లకే సత్సంగానికి ముందు బ్రేక్‌ఫాస్ట్‌కాని, టీ కాని ఏమీ కూడా ఇకపైన అందించబడవు. తొమ్మిది గంటలకు బ్రంచ్ ఇవ్వబడుతుంది. అంటే బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఈ రెంటికి మధ్యస్థమైనది. ఇది సరిపోతుంది. భోజనం పరిమితంగా తక్కువ మోతాదులో పెట్టడం జరుగుతుంది. రెండవసారి వడ్డించడం వుండదు. ఎందుకంటే మీరు ఆశ్రమములలో వున్నంతసేపు మీ ఉనికి యొక్క ఉద్దేశము మీ శరీరాన్ని మరియు ఆత్మను కలిపి ఉంచడమే. తద్వారా శరీరానికి ఏమైనా కాని ఆత్మ వికాసం చెందుతుంది. ఇక్కడ మేము ఉన్నది మీకు ఆహారమును ఇవ్వడానికి కాదు. మీరు స్వప్రయత్నంతో దశనియమాలను అనుసరించడం ద్వారా మీ హృదయములోని దివ్యత్వపు సమక్షాన్ని ఉత్తేజపరచడానికి మేము ఇక్కడ ఉన్నాము.

కాబట్టి 9 గంటలకు బ్రంచ్ వుంటుంది. మీరు రోజంతా ఇక్కడే వుంటే మూడు గంటలకు హై టీ ఉంటుంది. ఇది కూడ తగినంత మాత్రమే. నిండుగా కాదు కాని ఆధ్యాత్మిక పరంగా సంతృప్తికరం. రెండు మూడు రోజుల ఉత్సవం అయితే రాత్రి గం.7-30 ని॥లకు డిన్నర్ వుంటుంది. ఈ రోజు ఆదివారం ఉదయం గం.7-30 ని॥లకు ధ్యానం, సాయంత్రం ధ్యానం 5 గంటలకు లేదా 6 గంటలకు ఎలా వీలైతే అలా. కాని అంతకంటే ఆలస్యంగా కాదు. ఇది తప్పనిసరిగా పాటించాలి. ఒక వ్యక్తి వున్నా, ఒక మిలియన్ వ్యక్తులున్నా ఏమీ తేడా వుండదు.

మన ***ఆది గురువైన*** లాలాజీ గారు గం.6-30 ని॥లకు సత్సంగము అంటే వారు గం.6-30 ని॥ల కల్లా అక్కడ వుండేవారని బాబూజీ నాతో చెప్పేవారు. అక్కడ ఎంతమంది వున్నారనే విషయమే ఆలోచించకుండా సత్సంగము ప్రారంభించేవారు. పట్టించుకునేవారు కాదు. ఎందుకంటే వారు ప్రాణాహుతి (Tavajju) ని అక్కడ కూర్చున్న వారికే మాత్రము కాదు విశ్వంలో వున్న వారందరికి ప్రసారం చేసేవారు. ఇక సత్సంగము పూర్తి అయిన తరువాత వారికి యెంతో సన్నిహితంగా వుంటూ పురోగతి చెందిన ఒకరిద్దరు శిష్యులతో కలిసి కాసేపు నడిచి వచ్చేవారు. ఎందుకంటే సిట్టింగ్ సమయంలో శరీర వ్యవస్థలో ప్రాణవాయువు కొరత వలన దానిని తిరిగి భర్తీ చేసుకోవలసి ఉంటుంది. అందుచేత కొద్ది దూరం వరకు నడచి వచ్చేవారు.

లాలాజీ భౌతికపరంగా అంతగా కలిగినవారు కాదని బాబూజీ తన జీవితమంతా చెబుతూనే వుండేవారు. లాలాజీ ధనికులు కారు. వారి కుటుంబం పెద్దది. ఫతేఘడ్‌లో తీవ్రమైన చలికాలంలో కూడా వారి కుటుంబమంతా ఒకే ఒక చినిగిన కంబళి క్రింద నిదురించేవారని బాబూజీ కళ్ళకు కట్టినట్లు చెప్పేవారు.

మనం తెల్లవాళ్ళమయినా, నల్లవాళ్ళమయినా, పురుషులమైనా, స్త్రీలమైనా ఆధ్యాత్మిక వికాసం కావాలంటే కొద్దిపాటి అసౌకర్యము ఆవశ్యకమని మనం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే నాకు బాగా గుర్తు, ఒకసారి షాజహాన్‌పూర్ ఆశ్రమమునుండి అభ్యాసీలను చేర్చడానికి బస్సు ఏర్పాటు గురించి నేను బాబూజీకి సూచించడం నాకు గుర్తు వుంది. దానికి వారు “నీ ఆలోచన బాగుంది. కాని ఎక్కువ సౌకర్యం నాకు ఇష్టం లేదు. ఆధ్యాత్మికతకు ఇది వ్యతిరేకం” అని అన్నారు.

*ఇల్లత్, కిల్లత్, జిల్లత్* – *ఇల్లత్* అంటే ఏమిటి? *కిల్లత్* అంటే ఏమిటి? *జిల్లత్* అంటే ఏమిటి? నీ అవసరానికన్నా నీవద్ద తక్కువగా వుండాలి, పరిపూర్ణ ఆరోగ్యం కన్నా కొద్దిగా తక్కువ ఆరోగ్యము వుండాలి. ఎల్లప్పుడూ నీ గురించి విమర్శ వుంటూ వుండాలి. నీకు పదహారు అణాలు (ఒక రూపాయి) అవసరమున్నప్పుడు నీవద్ద పదిహేను అణాలు మాత్రమే ఉంటే నీవు ఖర్చు విషయంలో విజ్ఞతగా వుంటావు. తప్పనిసరిగా అయిన వాటికే ఖర్చుపెడతావు. బహుశః నీవు కొంత డబ్బు ఆదా చేయగలవేమో కూడ. నాకు గుర్తుంది, సుమారు డెబ్భై ఐదు ఏళ్ళ క్రితం 1935-36 సం॥లలో మా నాన్నగారు జబల్‌పూర్‌లో రైల్వేలో ఉద్యోగం చేసే రోజుల్లో వారి ఆదాయం నెలకు ఎనభై రూపాయలు. దాంట్లోనే వారు ఐదు రూపాయలు ఆదా చేయగల్గేవారు. కానీ ఈ రోజుల్లో, నెలకు ముప్పై వేలు, యాభై వేలు సంపాదిస్తున్న వారిని చూస్తున్నాము. వారెప్పుడూ అప్పుల్లో వుండి, వారి భవిష్యత్తు గురించి అహర్నిశమూ బాధపడుతూ వుంటారు. వారికి భవిష్యత్తు మీద గానీ, స్వయంగా వారి పట్ల గానీ నమ్మకం లేదు. వారి ఉద్యోగాల గురించి, వారి కుటుంబాల గురించి భయపడుతుంటారు. ఎందుకంటే,

...3

మనం అలవాట్లతో విచ్చలవిడిగా తయారయ్యాము. రాత్రి 11 గంటలు, 12 గంటలు, ఒంటిగంట ఈ విధంగా ఆలస్యంగా నిద్రించడం, ఆలస్యంగా నిద్ర లేవడం. ఉద్యోగానికి వెళ్ళడానికి ఐదు నిమిషాలు ముందు లేవడం, మరి ధ్యానం సంగతేమిటి? రేపు చూద్దాం.

**నేను తిరిగి మీ హృదయాల్లో ఆ అగ్నిని ప్రవేశపెడదామనుకుంటున్నాను!** సుఖవంతమైన జీవనంతోగాని, మిషన్ విధానాలు మీకు నచ్చేలా ఉంటేనూ అది సాధ్యపడదు. మీ మేనేజర్ గానీ, మీ పై అధికారి గానీ మిమ్ము సంతోషపెడితే అతనిలో ఏదో లోపముందన్నమాట. ఈ విషయాన్ని నేను ఉద్యోగం చేసే రోజుల్లో నేర్చుకున్నాను. అందరు మెచ్చే మేనేజరు, మేనేజరు కానే కాదు. అంటే అతడు విషయాలను తేలికగా తీసుకునేవాడు అన్నమాట. నీవేది చేయాలనుకున్నా దానినతడు చేయనిస్తాడు. నీవేది అనుకుంటే అదే చేస్తావు తప్ప అక్కడ చేయాల్సి వున్న దానిని కాదు. సహజ మార్గంలో ఇక అది పనిచేయదు. ఇది నేను మీ మేలు కోరే చెప్తున్నాను – మీరు గనుక ప్రస్తుత మానవజన్మలోనే అత్యున్నత వికాసం చెందాలంటే ఇలా లాభంలేదు. **కేవలం ఈ జన్మ** గురించే మీకు ఖచ్చితంగా తెలుసు. మరుజన్మ ఉందో, లేదో మనకు తెలియదు, తెలియవలసిన అవసరం లేదు. సహజ మార్గంలో గత జన్మల గురించి గాని, మరుజన్మల గురించి గాని తెలియవలసిన అవసరం లేదని బాబూజీ చెప్పేవారు. మనకు **ఈ జన్మ**తోనే సంబంధం, ఎందుకంటే ఇదే ఇప్పుడు మనకున్నది, దీన్నే మన ప్రయోజనం కోసం వినియోగించుకోవాలి. ఈ వివేకం ప్రతీరోజూ, రోజూవారీ జీవితంలో మీకు కలగాలి.

'ప్రొద్దు పొడవక ముందే నిద్రలెమ్ము' అని మీ నియమం చెబుతుంది. బాబూజీ మహరాజ్ రచించిన 'Reality at Dawn' పుస్తకం మీవద్ద ఉన్నది. ఆ సత్యతత్త్వాన్నీ దర్శించడానికి మీరు ప్రొద్దు పొడవక ముందే లేచి సిద్ధంగా లేకపోతే 'రియాలిటీ ఎట్ డాన్' అంటే ఏమిటో మీకు ఎలా తెలుస్తుంది? సూర్యోదయం చూడ్డానికి డార్జిలింగ్‌కు, ఎవరెస్టుకు, సూర్యోదయ మరియు సూర్యాస్తమయం చూడ్డానికి అమెరికాలో గ్రాండ్ కేనియన్‌కు విహారయాత్రలకు వెళుతుంటారు. ఎన్నో గంటల ముందు నుండే అక్కడ సిద్ధంగా ఉంటారు. కేవలం సూర్యోదయము, సూర్యాస్తమయం చూడ్డానికేనా? నీ హృదయంలోని రియాలిటీ ఎట్ డాన్ మాటేమిటి? ఇది సత్యం వద్ద ఉదయం లేదా సత్యం యొక్క ఉదయం కాదు. "Reality at Dawn" యొక్క అర్థాన్ని చాలా భాషల్లో పొరపాటుగా అనువదించడం జరిగింది. 'Reality at Dawn' అనేది మూల శీర్షిక (Original Title), అంటే ఏమిటంటే, ఉదయాన (at Dawn) సత్యతత్త్వంగా తనని తానుగా వ్యక్తపరుచుకునేది.

అందుచేతనే, దయచేసి సూర్యోదయానికి ముందే లేచే అలవాటు చేసుకోండి. నాలుగున్నరకు అనుకుందాం. శారీరక, మానసిక పరిశుభ్రతను పాటిస్తూ ధ్యానానికి కూర్చోండి. ఒక గంట కాలాన్ని నిర్దిష్టంగా తీసుకోండి. మీ అలారాన్ని పెట్టుకోండి. అది మ్రోగేవరకు లేవకండి. ఖాళీ కడుపుతో కూర్చోండి. తొలుత దశాదేశాలుగా పిలవబడిన ఈ దశనియమాలు మన లబ్ధికొరకేనని దయచేసి గుర్తుంచుకోండి. ఆ పది నియమాలు మీ జీవితాలలో దైనందిన నడవడికకు కావలసిన వాటినన్నింటిని ఇస్తాయి. ఏ విధంగా మీరు భుజించాలి? మీరు దేనిని భుజించాలి? మేము బాబూజీ మహరాజ్‌తో కూర్చుని ఉన్నప్పుడు, అక్కడ ఇరవై మంది భోజనం చేస్తూ వుండడం చూసి బాబూజీ నా చెవిలో, "ఆ వ్యక్తిని చూడు, పందివలె తింటున్నాడు" అని చెవిలో మెల్లగా చెప్పేవారు. అతడి ధ్యాసంతా ఆహారం మీదనే. ఏ దైవము వలన అతను తినగలుగుతున్నాడో, ఎవరు తినడానికి ఆహారాన్ని ప్రసాదిస్తున్నారో, ఎవరు తినడానికి శక్తినిస్తున్నారో వారి గురించి కాని, వారి స్మరణపై కాని ధ్యాస లేదు అతనికి. భుజించడం అంత తేలికైన విషయం కాదు సుమా!

మొదటగా మీరు తినడానికి యేదో ఒకటి కావాలి. మీకు తినడానికి సమయం కావాలి. తినే సామర్థ్యం కూడా కావాలి. తిన్నదాన్ని జీర్ణించుకునే సమర్థత మీకు కావాలి. శరీరం తనకు కావలసిన దానిని గ్రహించిన తదుపరి మిగిలిన వాటిని విసర్జించగలిగే సమర్థత మీకు కలిగివుండాలి. ఇది బంగాళదుంప కూరతో రొట్టెను ఆత్రంగా నోటితో తినేటంత సులభమైనది కాదు. భుజించడానికంటూ కొన్ని నియమాలు వున్నాయి – మనం ఎలా భుజించాలి, ఎప్పుడు భుజించాలి, దేనిని భుజించాలి. వీటిపై ఎవరూ ధ్యాస పెట్టరు – మనం ఈ రోజున తింటున్నది కేవలం సుఖంకోసం తప్ప జీవించడానికి కాదు.

...4

మనం జీవితంలో చేసే ప్రతీదీ – శ్వాస తీసుకోవడం, తినడం, త్రాగడం, పనిచేయడం, తీరిక, నిద్ర – అన్నియు జీవించడం కొరకు మాత్రమే అన్న నియమానికి అనుసరించి ఉండాలి. మరియు జీవించడం అనేది ఒకే ఒక లక్ష్యం కొరకు నేను మానవస్థాయి నుండి స్వయం దివ్యత్వపు స్థాయికి వికాసం చెందడానికి మాత్రమేనన్న విషయాన్ని మీ అందరికి మరల జ్ఞప్తికి తీసుకురాదలిచాను. ప్రియ సోదరీ, సోదరులారా! ఆధ్యాత్మిక జీవితానికి సరళమైన, సాధారణమైన జీవనము ఎంతో ఆవశ్యకమని, మరియు ఆడంబరము దీనికి వ్యతిరేకమైనదన్న విషయాన్ని గ్రహించి వీటిని అంగీకరించే విజ్ఞతను పెంపొందించుకొనుట అత్యంత ఆవశ్యకం.

విలాసవంతమైన జీవితం గడపకపోయినా నీవు ధనవంతుడివి కాగలవు. నేను రామాయణంలోని ఒక ఘట్టాన్ని చూశాను. రాముడు తన భార్యను అడవిలో వదలివేయమని లక్ష్మణునికి చెప్పిన తదుపరి, నేలపైనే నిద్రిస్తుంటాడు. అప్పుడు లక్ష్మణుడు, “అన్నగారు ఇదేమిటి యేమి చేస్తున్నారు మీరు” అని అంటాడు. దానికి రాముడు, “అవును, నేను ఇప్పుడు బ్రహ్మచారి జీవితాన్ని గడుపుతున్నాను” అని అంటాడు. కనుక చూడండి. సరళమైన, సాధారణమైన జీవనం బిచ్చగాళ్ళకు లేక పేదవాళ్ళకు మాత్రమే కాదు. ఇది ధనికులకు మరింత ఆవశ్యకం. ఎందుకంటే వారి ఆడంబర జీవితం వలన, పనికిమాలిన ఆలోచన ధోరణి వలన, తప్పుడు ఆహారపు అలవాట్లు వలన, వేళకాని వేళలో నిద్రించడం, నిద్ర మేల్కొనకుండా వుండటం వలన వారి యొక్క ఆధ్యాత్మిక వికాసానికి గల అవకాశాన్ని రోజురోజుకు కోల్పోతూ, ప్రతిక్షణం వారి జీవితంలో మార్గాన్ని కోల్పోయే ప్రమాదంలో వున్నారు.

ఇందువలన, ప్రతిరోజు ఒకసారి దశ నియమాలను చదవడం, దానిని అర్థం చేసుకోవడం మరియు అనుసరించడం అనేది మీ **వ్యక్తిగత** నియమంవలె పాటించండి. ఈ విషయంలో మీకు సహాయం కొరకు మిషన్ తన దైనందిన కార్యక్రమాలను క్రమబద్ధీకరిస్తున్నది. ఆదివారం సత్సంగము ఉదయం గం.7–30 ని॥లకు, సాయంకాలం సత్సంగం గం.5–30 ని॥లకు లేదా 6 గంటలకు; ఉదయం 9 గంటలకు బ్రంచ్, దానికన్నా ముందు యేమి ఇవ్వబడదు. సాయంకాలం మూడు గంటలకు హై టీ, భోజనానికి మధ్యలో యేమి వుండదు. క్యాంటీన్ తెరిచే వుంటుంది. కాని కిచన్ మరియు క్యాంటీన్లు రెండు ఉదయం 9 గంటలకు ముందుగా తెరవబడవు.

ఈ ఉదయం మిమ్ములను ఇంతమందిని ఇక్కడ చూసి బహుశా ఈ చిన్న ప్రసంగం కూడ నేను ఇవ్వవలసిన అవసరం లేదన్న ఆలోచన నాకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. ఎందుకంటే, నేను ఉదాహరణగా వుంటే మీరు అనుసరించడానికి సంసిద్ధంగా ఉన్నారు. మీరందరు ఇక్కడ వుండి నాకు ఈ ప్రోత్సాహాన్ని ఇచ్చినందులకు నేను చాలా కృతజ్ఞుడను. మీరిచ్చిన ప్రోత్సాహం వల్లనే మాట్లాడగలుగుతున్నాను – నా మనస్సులో వారు యేమి చేస్తారో నన్న సంకోచము లేక భయముతో కాదు – వీరంతా నావాళ్ళు, మరియు **వారి** లబ్ధి కొరకు నేను చెప్పిన దానికి వారు విధేయులుగా వుంటారు అని నా హృదయం నుండి వస్తున్న ధీమాతో.

ధన్యవాదాలు.